ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతి అభివృద్ధి పనులను రానున్న రెండున్నర సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖా మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

- మహిళల అభ్యున్నతికి అవసరమైన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

- నైరుతి రుతుపవనాల విస్తరణ కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజధాని అమరావతి అభివృద్ధి పనులను రానున్న రెండున్నర సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ ఉదయం ఆయన వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అమరావతిని ప్రపంచంలోనే తొలి ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో డిజైన్ ను రూపొందించినట్టు తెలిపారు. రాజధాని అభివృద్ధికి తొలిదశలో 48 వేల కోట్ల రూపాయలు అవుతాయని అంచనా వేశామని, తొలి దశ పనులతో సిటీ నిర్మాణ పనులు పూర్తి అవుతాయని, రెండో దశలో మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాజధానిలో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా రూపొందించినట్టు వివరించారు. అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఏ సమయానికి ఏ పని పూర్తవుతుందనే విషయాన్ని త్వరలో ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా విజయనగరం జిల్లాకు వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తొలుత మంత్రి విజయనగరంలోని శ్రీ పైడితల్లి

అమ్మవారిని సతీ సమేతంగా దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... తనకు అప్పగించిన మంత్రిత్వ శాఖకు సంపూర్ణ న్యాయం చేస్తామని, సెర్ప్ ద్వారా మహిళల అభ్యున్నతికి వివిధ కార్యక్రమాలు చేపడతామని వివరించారు. విజయనగరం జిల్లా అభివృద్ధి కోసం ప్రజలంతా సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నంద్యాల ప్రజల నీటి కష్టాలను త్వరలోనే తీరుస్తామని న్యాయశాఖ మంత్రి ఎం.డి. ఫారుక్ తెలిపారు. ఈరోజు ఆయన మహానంది రోడ్డులో ఉన్న అమృత్ ఫేస్ వన్ పనులు, ఫిల్టర్ బెడ్ లను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... అమృత్ ఫేస్1 పనులను సుమారు 150 కోట్ల రూపాయల ఖర్చుతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని, దాదాపు 75 శాతం పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. అమృత్ ఫేస్ వన్ పథకం కింద మిగిలిన పనులను పూర్తి చేసి, వచ్చే నెలలో వెలుగోడు రిజర్వాయర్ నుండి పైపుల ద్వారా నీటిని విడుదల చేస్తామని వివరించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల సహకారంతో నంద్యాల జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాల విస్తరణ ప్రస్తుతం మల్కన్‌గిరి, విజయనగరం మీదుగా కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. వచ్చే 4, 5 రోజుల్లో రుతుపవనాలు కోస్తాంధ్ర, ఒడిశా, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతాలకు వ్యాపించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్టు పేర్కొంది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవచ్చని తెలిపింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సరైన పద్ధతిలో ఆచరిస్తే బౌద్ధం నేటికీ మానవాళికి ఎంతో మేలు చేస్తుందని లతా రాజా ఫౌండేషన్ ధార్మిక సంస్థ చైర్మన్ కె. కె. రాజా అన్నారు. ఆకాశవాణి సీనియర్ ఎనౌన్సర్ డాక్టర్ బండి సత్యనారాయణ రాసిన నిర్వాణ నవలను ఈ సాయంత్రం ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంజనీరింగ్ సి. సుబ్బారావు ముఖ్య అతిథిగానూ, కార్యక్రమాల విభాగాధిపతి పి. వి. రామ గోపాల్ అధ్యక్షులు గానూ పాల్గొనగా... డాక్టర్ మాటూరి శ్రీనివాస్ నవలను సమీక్షించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ను కేన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. ఈ ఉదయం ఆయన సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ... రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిమ్స్ తరహా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కేన్సర్ ను ముందుగానే గుర్తించి, వైద్య సేవలు అందజేసే లక్ష్యంతో దాదాపు 5 కోట్ల 30 లక్షల మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేసినట్టు మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాల్తేరు డివిజన్‌లో పలు చోట్ల వంతెనల నిర్మాణ పనుల కారణంగా రేపు పలు రైళ్ళను రద్దు చేసినట్టు డివిజనల్ రైల్వే మేనేజర్ కె. సందీప్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... వాల్తేరు డివిజన్‌లోని చీపురుపల్లి యార్డులోను, అదేవిధంగా

కోటబొమ్మాళి, తిలారు స్టేషన్ల మధ్య ... వంతెన నిర్మాణ పనులు, పూండి, పలాసా సెక్షన్‌లో భద్రతా పనులు చేపడుతున్న కారణంగా కొన్ని రైళ్ళను రద్దు చేశామని, మరి కొన్ని రైళ్ళను పాక్షికంగా రద్దు చేసినట్టు వివరించారు. విశాఖపట్నం నుంచి పలాస, గుణుపూర్ ల మధ్య నడిచే రెండు ప్యాసింజర్ జత రైళ్లతో పాటు విశాఖపట్నం- బ్రహ్మపూర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ జత రైళ్లను రద్దు చేశామన్నారు. అదేవిధంగా మరికొన్ని రైళ్ళ సమయాల్లో మార్పులు చేసినట్టు డీఆర్ ఎం తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారిగా ఐఏఎస్ అధికారి జె. శ్యామలరావు ఈరోజు బాధత్యలు స్వీకరించారు. పూర్వ ఈవో ధర్మారెడ్డి అధికారికంగా బాధ్యతలను శ్యామలరావుకు అప్పగించారు. ఈ సందర్బంగా నూతన ఈవో మాట్లాడుతూ... బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతమని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఈవో సిబ్బందికి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు మంచి రోజులు వచ్చాయని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ ... ఫ్యాప్సియా... అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ అన్నారు. రాష్ట్రంలో ఎం ఎస్ ఎమ్ ఈ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =